పీఎంశ్రీతో డిజిటల్ సొబగులు

- ఎంపిక చేసిన పాఠశాలల్లో ప్రమాణాల పెంపు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యం
- మండలం నుంచి మూడు పాఠశాలల ఎంపిక

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యాభివృద్ధికి అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రవేశపెట్టడంతో పాటు ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ భారత్ (పీఎంశ్రీ) అనే పేరుతో ఓ పథకానికి రాష్ట్రం భాగస్వామ్యంతో కేంద్రం శ్రీకారం చుట్టింది. ప్రాథమిక విద్యలో సమూల మార్పులు తీసుకురావడం, మౌలిక వసతులు కల్పించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని విద్యాశాఖ చెబుతుంది. ఈ పథకం కింద ఎంపికైన పాఠశాలల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను మంజూరు చేస్తే మిగిలిన 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాలి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకాన్ని రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటోంది.

మండలానికి మూడు స్కూల్స్ ఎంపిక

పీఎంశ్రీ పథకం కింద గత ఏడాది ఒక్కో పాఠశాల ఎంపిక కాగా ఈ ఏడాది మూడు స్కూళ్ల చొప్పున ఎంపిక చేసేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తుంది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో తొలి విడతగా 2021-22 యూ డైస్ జాబితా ఆధారంగా 46 అంశాలను ప్రాతిపదికగా తీసుకుని 11 పాఠశాలలను గుర్తించారు. రెండో దశలో 33 పాఠశాలలను ఎంపిక చేయనుంది. మండలం నుంచి 20 పాఠశాలలు దరఖాస్తు చేసుకోవాలని అందులో నుంచి మూడు స్కూళ్లను ఎంపిక చేస్తామని ఆయా మండలాల్లోని విద్యాశాఖ ఇప్పటికే ప్రకటనలను విడుదల చేసింది. అరవై శాతం ఫలితాలు సాధించిన గ్రామీణ ప్రాంతాల పాఠశాలలను పీఎంశ్రీ పథకం ఎంపికలో ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలుస్తోంది.

మౌలిక వసతులు, సౌకర్యాల పెంపు

పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యా బోధన, సదుపాయాలు మరింతగా మెరుగు పరుస్తారు. అంతేకాకుండా అదనపు తరగతి గదులు నిర్మిస్తారు. అదనపు వసతుల కల్పన, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన సామగ్రిని సమకూరుస్తారు. ఏ మేరకు పనులు చేపట్టాలనే అంశంపై జిల్లా స్థాయి కమిటీలు ప్రతిపాదనలు మేరకు చర్యలు తీసుకుంటారు.. ఇందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి విద్యాశాఖ అధికారులకు ఇప్పటికే ఆదేశాలు అందాయి.

ప్రధానోపాధ్యాయుల నుంచే ప్రతిపాదనలు

పీఎంశ్రీ పథకానికి ఎంపికైన పాఠశాలల్లో ఎలాంటి అదనపు వసతులు కావాలనే అంశంపై ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులే నివేదికలు సమర్పించాలి. ఈ నివేదికలు రూపొందించే ప్రక్రియపై ఇప్పటికే విద్యాశాఖ హెచ్ఎంలకు మార్గదర్శకాలు కూడా జారీ చేసింది. త్వరలో ప్రధానోపాధ్యాయులు తమ ప్రతిపాదనలను సమగ్ర శిక్ష అభియాన్‌కు పంపుతారు. అనంతరం రాష్ట్రం ప్రభుత్వం పరిశీలించిన అనంతరం వాటిని కేంద్రానికి పంపుతారు. ఈ పథకం కింద ఐదేళ్ల పాటు పాఠశాలలకు అవసరమైన నిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి మంజూరవుతాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'నాడు-నేడు' పథకం వల్ల రాష్ట్రంలోని పాఠశాలల రూపురేఖలు మారాయి. ఈ నేపథ్యంలో పీఎంశ్రీకి ఎంపికైన పాఠశాలల్లో అందుబాటులో ఉన్న అత్యాధునిక హంగులకు సాంకేతికతను జోడిస్తున్నారు. తరగతి గదులను డిజిటలైజేషన్ దిశగా తీర్చిదిద్దనున్నారు.

పీఎంశ్రీతో ప్రయోజనాలెన్నో..

- ఎంపికైన పాఠశాలలకు దశల వారీగా నేరుగా నిధుల కేటాయింపు
- డిజిటల్ పద్ధతిలో బోధన, ప్రయోగశాలలు, ఇతర వసతులు
- ఉపాధ్యాయులకు శిక్షణతో పాటు ఆర్థిక, సాంకేతిక తోడ్పాటు
- ప్లాస్టిక్ రహితంగా పాఠశాలలను తీర్చిదిద్దడం
- సంప్రదాయ విధానాలపై విద్యార్థులకు అవగాహన
- హరిత పాఠశాలలుగా మార్చడం
- బడి ఆవరణలో సేంద్రియ విధానంతో కూరగాయలు, ఆకుకూరల సాగు
- దివ్యాంగ విద్యార్థులకు బోధన పరికరాల ఏర్పాటు
- బాలిక విద్య అభివృద్ధి, సైన్స్, ప్రాజెక్టులు
- అందుబాటులోకి గ్రంథాలయం, క్రీడా పరికరాలు
- సోలార్ ప్యానల్స్, ఎల్ఈడీ విద్యుత్ దీపాల సౌకర్యం ఏర్పాటు



పీఎంశ్రీకి ఎంపికైన మూలస్థాన అగ్రహారం జెడ్పీ హైస్కూల్

పీఎంశ్రీతో ప్రభుత్వ పాఠశాలకు మహర్దశ



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పీఎంశ్రీ పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టనుంది. విద్యార్థులకు నాణ్యమైన బోధనలను అందించడంలో దోహదపడుతుంది. ప్రైవేటు స్కూళ్లతో పోటీ పడే విధంగా ప్రభుత్వ పాఠశాలలు తయారవుతాయి.

– పి.షాలెంరాజు, ఎంఈఓ, ఆలమూరు

పాఠశాలలకు మరిన్ని సౌకర్యాలు



'నాడు-నేడు' పథకంలో కొంత వరకూ పాఠశాలలను ఆధునీకరించారు. ఇపుడు పీఎంశ్రీ పథకం ద్వారా పాఠశాలలకు త్వరలో డిజిటలైజ్డ్ తరగతి గదులు, అత్యాధునిక ల్యాబ్‌లు, బోధన సామగ్రి సమకూరనున్నాయి. పిల్లలు విద్యలో మరింతగా రాణించేందుకు అవకాశం లభిస్తుంది.

– గంటా శ్రీనివాసు, పీఎంసీ కమిటీ చైర్మన్, ఆలమూరు

నా మట్టి-నా దేశం కార్యక్రమం

సఖినేటిపల్లి: సఖినేటిపల్లిలంకకు చెందిన ఏపీ నేషనల్ గ్రీన్ కోర్ రాజోలు క్లస్టర్ కో ఆర్డినేటర్, తెలుగు టీచర్ గుండేపల్లి ప్రభావతి ఆధ్వర్యాన స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులతో కలసి ఆమె వివిధ రకాల మొక్కలను నాటారు. అలాగే యాలకులు, ఖర్జూరపు మొక్కలతో పాటు ఇతర ఔషధ మొక్కలను కూడా ఆమె నాటారు. పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు నిచ్చే మొక్కలతో పాటు, భావితరాలకు ఉపయోగపడే మొక్కలను కూడా నాటడంలో ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని ప్రభావతి పిలుపునిచ్చారు.



సఖినేటిపల్లిలంక జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో కలసి మొక్కలు నాటుతున్న ప్రభావతి

జిల్లా పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందనలు

సఖినేటిపల్లి: రాష్ట్ర ప్రభుత్వం 67వ స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో భాగంగా కేశనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్-14, అండర్-17 బాలుర, బాలికల విభాగాల్లో రాణించిన జీవీ పుంత జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఏడుగుర్ని బోధన సిబ్బంది, ప్రజాప్రతినిధులు అభినందించారు. సోమవారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో అథ్లెటిక్స్‌లో విజయం సాధించి, జిల్లా స్థాయి టీంకు ఎంపికైన వీరిని హెచ్ఎం డీవీఆర్‌కేపీ ప్రసాద్, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ బైరనాగరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ తాడి ప్రేమజ్యోతి అభినందనలు తెలిపారు. అలాగే వీరికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు కొల్లు సతీష్‌కుమార్‌ను కూడా ప్రత్యేకంగా అభినందించారు.


జీవీ పుంత జెడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా స్థాయి టీంకు ఎంపికైన విద్యార్థులతో బోధన సిబ్బంది

వైభవంగా గణపతికి లక్షబిల్వార్చన

అంబాజీపేట: గణపతి నవరాత్రుల సందర్భంగా అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న శ్రీలక్ష్మీ గణపతి స్వామివారికి సోమవారం లక్ష దుర్వాసహిత పంచ బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. శైవాగమ పండితుడు, ఆలయ అర్చకుడు మర్ల శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో వెలవలపల్లి సుబ్రహ్మణ్యశర్మ పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ, మహన్యాస మంత్ర పఠనం, రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం గణపతి హోమం నిర్వహించారు. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన చేపట్టారు.

మామిడికుదురు: గణపతి నవరాత్రులో భాగంగా కొమరాడ పాళ్లమ్మతల్లి ఆలయం వద్ద ఉపాధ్యాయుడు కాపవరపు గోపాలకృష్ణ ఆధ్వర్యంలో చిన్నారులు వినాయకుడి విగ్రహాన్ని రిక్షాపై ఊరేగిస్తూ సందడి చేశారు. మేళతాళాలతో రంగులు చల్లుకుంటూ ఈ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. మాకనపాలెం రామాలయం వద్ద యువకులు చేసిన విన్యాసాలు భక్తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. 25 అడుగుల ఎత్తులో ఉన్న బూరుగు చెట్టు చివర మామిడితోరణాలు కట్టి ఆ చెట్టు పొడవునా ఆముదం రాశారు. చెట్టు చివరన ఉన్న మామిడితోరణాన్ని తాకిన వారికి రూ.రెండు వేలు నగదు బహుమతి ప్రకటించారు. ఈ క్రీడలో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని మామిడి తోరణాన్ని తాకారు. పాశర్లపూడి కొండాలమ్మచింత వినాయకుడి ఆలయం వద్ద జరిగిన శ్రీలక్ష్మీ గణపతి హోమంలో అడబాల నాగేశ్వరరావు దంపతులతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. పెదపట్నంలంకలోని గిడుగువారిపాలెం ఆలయం వద్ద యువతులు ప్రదర్శించిన భరతనాట్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.


అంబాజీపేటలో లక్ష్మీ గణపతి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆలమూరు: గణపతి నవరాత్ర వేడుకలను పురస్కరించుకుని మండలంలోని వివిధ గ్రామాల్లోని ఆలయాలు, మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపాల వద్ద ఏర్పాటు చేసిన చలువ పందిళ్లలో నిర్వాహకులు భజన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే ఉదయం, సాయంకాలం వేళల్లో దంపతులు గణనాథుడికి పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. గణపతి ఆలయాల వద్ద నిర్వాహకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

రూ.27 పలికిన వినాయకుని లడ్డూ

రాజోలు: స్థానిక కొత్త వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద యమహా యూత్ ఆధ్వర్యంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయకుని చేతిలో ఉంచిన 12 కేజీల లడ్డూ రూ.27 వేలకు స్థానిక హోటల్ యజమాని ఆకుల రాము వేలంలో దక్కించుకున్నారు. అలాగే రాజోలు ఆకుల వారి వీధిలో ఎస్ఆర్‌పి యూత్, వేగివారిపాలెం పెదపాలెం వద్ద లక్ష్మీగణపతి యూత్ ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు.

క్యాన్సర్ బాధిత బాలిక వైద్యానికి సాయం

రావులపాలెం: గత కొంత కాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న బాలికకు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవాసమితి సభ్యులు సోమవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన వేమగిరి అభినయ గత ఏడేళ్లుగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతుంది. కొంతకాలం ఆస్పత్రిలో వైద్యం చేయించుకోవడం జరిగింది. ప్రస్తుతం కాకినాడలోని క్యాన్సర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. పేదరికంలో ఉన్న తండ్రి వెంకటేష్ ఆటో డ్రైవర్‌గా కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో సాయం చేయాలని సేవా సమితి సభ్యులను కోరగా రూ.15 వేల ఆర్థిక సాయాన్ని వైద్య ఖర్చుల కోసం అందజేసినట్టు సేవా సమితి సభ్యులు తెలిపారు.


బాధిత బాలిక తండ్రి వెంకటేష్‌కి సాయం అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

ఆరోగ్యానికి వరం... ఆయుష్మాన్ భవ

అంబాజీపేట: దేశంలో ఎక్కడైనా వైద్యం చేయించుకునేందుకు ఆయుష్మాన్ భారత్ పీఎంజేఏవై, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం నిరుపేదలకు వరం వంటిందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. మాచవరం కోఠివారి అగ్రహారంలో అంబాజీపేట పీహెచ్‌సీ వైద్యాధికారి వి.గౌతమి ఆధ్వర్యంలో ఆరోగ్య మిత్ర ధనరాజ్ అధ్యక్షతన ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులను సోమవారం పంపిణీ చేశారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ కార్డు ద్వారా ఏడాదికి రూ.5 లక్షల వరకు వైద్యం పొందవచ్చన్నారు. ఈ కార్డు ఉన్న వారు ఏ కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్లిన ఒక్క రూపాయి చెల్లించకుండా వైద్యం చేయించుకునేలా సీఎం జగన్ చర్యలు తీసుకున్నారన్నారు. ఈ అవకాశాన్ని రోగులు సద్వినియోగం చేసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ర్యాలి శ్రీనివాస వడయార్, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


మాచవరంలో ఆయుష్మాన్ భవ కార్డులను పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళాలు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి భక్తుల నుంచి విరాళాలు అందితున్నట్లు ఆలయ చైర్మన్, ఈవోలు రుద్రరాజు రమేష్ రాజు, ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. కాకినాడకు చెందిన వి.వేంకటేశ్వరరాజు–నందిని దంపతులు రూ.11,521, ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన డి.రాజు రూ.11,116, రాజమహేంద్రవరానికి చెందిన కె.వెంకట సత్యనారాయణరాజు రూ.10 వేలు, హైదరాబాద్‌కు చెందిన ఎం.శ్రీధర్–నాగహరిత దంపతులు రూ.10,116, పెనుగొండ మండలం వడలికి చెందిన జి.సత్యసాయి ప్రసాద్ రూ.10,116, రాజమహేంద్రవరానికి చెందిన ఎస్.దుష్యంత్‌రమణ రాయుడు రూ.10 వేలు, ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామానికి చెందిన ఎం.రామకృష్ణ–భవానీ దంపతులు రూ.10 వేలు, విశాఖ పట్నానికి చెందిన వై.వెంకట నాగ శివకిషోర్–సూర్యకామేశ్వరి రూ.10,116 విరాళాలు అందించినట్లు తెలిపారు.

ర్యాలిలో నిత్యాన్నదానానికి విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి ఆలయ ఆవరణలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన గురజాల ప్రసాద్‌రాజు కుటుంబ సభ్యులు రూ. 10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు.

చురుగ్గా జగనన్న సురక్ష సర్వే

కొత్తపేట: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. ఈ నెల 30 నుంచి సచివాలయాల పరిధిలో వైద్య నిపుణులతో 'జగనన్న ఆరోగ్య సురక్ష' శిబిరాలు నిర్వహించనున్న నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల్లో సర్వే విస్తృతంగా సాగుతోంది. పలివెలలో జరుగుతున్న ఆరోగ్య సర్వే కార్యక్రమాన్ని సోమవారం ఎంపీపీ గంగాధరరావు పరిశీలించారు. ఆయన బీపీ, సుగర్ పరీక్షలు చేయించుకున్నారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ప్రజారోగ్యమే లక్ష్యంగా వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చి, అనేక పథకాలు అమలు చేస్తుందన్నారు. ప్రజలు ఏమాత్రం అనారోగ్య లక్షణాలు ఉన్నా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణ అధికారి బీవీవీ సత్యనారాయణ, ఆరోగ్య పర్యవేక్షకుడు రవిచంద్ర, హెల్త్ అసిస్టెంట్ కొమ్ముల మాచరరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.


పలివెలలో సురక్ష సర్వేలో బీపీ చెక్ చేయించుకుంటున్న ఎంపీపీ గంగాధరరావు

అంబాజీపేట: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారులు వి.గౌతమి, జి.శైలజల పర్యవేక్షణలో మాచవరం, కె.పెదపూడి తదితర గ్రామాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుటుంబ సభ్యులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. రోగులకు బీపీ, సుగర్ తదితర వాటిని పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. రోగుల వివరాలను తెలుసుకుని వారికి వైద్య పరీక్షలు చేసి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటున్నామన్నారు. ఈ నెల 30న అంబాజీపేటలో నిర్వహించే క్యాంపునకు వచ్చేందుకు వారికి వివరిస్తున్నామన్నారు.

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీల పరిధిలోని వివిధ గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చురుగ్గా జరుగుతుంది. పెదపళ్ల, స్థానిక వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి రక్త పరీక్షలు నిర్వహించి అనారోగ్య బాధితుల వివరాలను నమోదు చేసుకున్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పురస్కరించుకుని ఈనెల 30 నుంచి ఏర్పాటు చేయనున్న వైద్య శిబిరాల్లో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్యనిపుణులు వైద్యసేవలను అందజేస్తామని వారు తెలిపారు. సీహెచ్ఓ పి.రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ రాజా తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో యువకుడి మృతి

అయినవిల్లి: నేదునూరులో ఓ యువకుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆదివారం రాత్రి మృతి చెందాడు. దీనికి సంబంధించి స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయినవిల్లి మండలం నేదునూరు గ్రామానికి చెందిన ఇందుగుల వెంకట్రామయ్య మిల్లు వద్ద సిమెంట్ పనులు చేస్తున్న దుబా సాయి (23) విద్యుత్ మోటార్‌ను ఆన్ చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీనిపై మృతుడు తండ్రి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

రైతుల సహకారంతోనే సొసైటీల అభివృద్ధి

అంబాజీపేట: సొసైటీల అభివృద్ధికి రైతుల సహకారం ఎంతో అవసరమని సొసైటీ అధ్యక్షుడు బొంతు శ్రీనివాస్ అన్నారు. చిరతపూడి సొసైటీలో సీఈఓ కేశనకుర్తి సత్యనారాయణ అధ్యక్షన మహాజన సభను సోమవారం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం సీఎం జగన్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. రైతులకు మెరుగైన సేవలందించేందుకు ఆర్బీకేలను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయి సమాచారాన్ని అందిస్తున్నారన్నారు. సొసైటీల్లో తీసుకున్న రుణాలను సత్వరమే చెల్లించి తిరిగి రుణాలు పొందాలన్నారు. ఈ సభలో సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగారాజు, సభ్యులు రంపం గోవిందు, నక్కా సత్యనారాయణ, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత బీమాపై అవగాహన

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెం పంచాయతీ వద్ద సోమవారం వైఎస్సార్ సీపీ గ్రామ సచివాలయ కన్వీనర్లకు, గృహసారథులకు ఉచిత బీమాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు సూచనలతో జగనన్న కన్వీనర్ల సారథి (జేసీఎస్) మండల ఇన్‌చార్జ్ నల్లి మోహన్ ఆధ్వర్యాన పై కార్యక్రమం నిర్వహించారు. మాజీ సర్పంచ్ నల్లి సురేంద్రతో కలసి ఆయన పలువురు గృహసారథులకు, సచివాలయ కన్వీనర్లకు ఉచిత బీమా నమోదు దరఖాస్తులను పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగమణి, తాడి సహదేవ్, రొక్కాల వెంకట్, పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గోగన్నమఠంతో దంత పరీక్షలు


వైద్య పరీక్షలు చేస్తున్న దంత వైద్యులు

మామిడికుదురు: డాక్టర్ బీవీ రాజు ఫౌండేషన్ ద్వారా శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు దంత వైద్య సేవలందిస్తున్నామని డాక్టర్ వినయ్‌చంద్ర, రమేష్, కార్తిక్‌వర్మ, ఆర్‌వీ రాజు పేర్కొన్నారు. గోగన్నమఠంలో ఏర్పాటు చేసిన విష్ణు డెంటల్ హాస్పిటల్ ద్వారా సోమవారం స్థానిక ప్రజలకు వైద్య సేవలందించారు. అక్కడ జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ అల్లు విజయలక్ష్మి అధ్యక్షత వహించారు. గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆధునిక సదుపాయాలతో మారుమూల ప్రాంతాల ప్రజలకు దంత వైద్య సేవలందించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సాగి పీఆర్‌వీఎస్ఎస్ నర్సింహవర్మ, మండల పరిషత్ వైస్ చైర్మన్ భూపతిరాజు లక్ష్మి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు భూపతిరాజు ఈశ్వరరాజువర్మ, మాజీ సర్పంచ్‌లు చిగురుపాటి పెద్దిరాజు, లంకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మొసలి కోసం గాలింపు చర్యలు

ఆత్రేయపురం: గత 5 రోజుల క్రితం బొబ్బర్లంక లాకు వద్ద గోదావరి మెయిన్ రెగ్యులేటరీ వద్ద మొసలి సంచారంతో సోమవారం అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్లజగ్గిరెడ్డి ఆదేశాలతో గాలింపు చర్యలు చేపట్టారు. మొసలి సంచారంపై ఎస్సై కిరణ్‌కుమార్, ఫారెస్టు సెక్షన్ అఫీసర్ ఎ.పట్టాబి, ఇరిగేషన్ ఏఈ పిల్లా సత్యనారాయణ, డిప్యూటీ రేంజ్ అధికారి ఎ.రవి, బీట్ అధికారి సాయిబాబా ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొని గాలింపు చర్యలు చేపట్టారు. మత్స్యకారులు కాలువలో వలతో గాలిస్తున్నారు. అలాగే కాలువలో నీటిని కూడా తగ్గించారు. దీంతో స్థానిక ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అధికారులు పర్యవేక్షణ లేకుండా కాలువల్లోకి దిగవద్దన్నారు. వినాయకుని నిమజ్జనం, ఆటవిడుపు, ఇతర సందర్భంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు.

ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాలాజీ

సఖినేటిపల్లి: మోరి మెయిన్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఉండపల్లి వీవీ సత్యనారాయణ (బాలాజీ) ఎస్టీయూ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. సోమవారం ఈ విషయాన్ని ఆయన చెప్పారు. అమలాపురంలో ఆదివారం జరిగిన సదరు సంఘ జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయనను నియమించారు. సహచర ఉపాధ్యాయ సంఘ సభ్యులు బాలాజీని అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అంబాజీపేట: మద్యానికి బానిసై ఓ వ్యక్తి గుళికలు తీసుకుని అమలాపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పండువారిపేటకు చెందిన నేదునూరి నాగేశ్వరరావు (40) మద్యానికి బానిసై కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని అతని కుటుంబీకులు ప్రశ్నించడంతో మనస్థాపానికి గురై ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లి పోయాడన్నారు. నాగేశ్వరరావు ఎంతకీ ఇంటికి రాకపోవడంతో చుట్టుపక్కల వెతుకుతుండగా సమీప ఏటిగట్టుపై పడుకుని ఉన్నాడన్నారు. అతడిని ఇంటికి తీసుకువచ్చిన తరువాత నోటి నుంచి నురగలు రావడంతో మృతుడిని విచారించగా గుళికలు తీసుకున్నట్లు చెప్పాడన్నారు. స్థానికులు, కుటుంబ సభ్యులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు.

సీఎంను కలసిన ఎమ్మెల్యే


సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలుసుకున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అసెంబ్లీలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎంకు రెండు చేతులు జోడించి నమస్కరించారు. సీఎం జగన్ ఎమ్మెల్యే చిట్టిబాబు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారని ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యే ఇటీవల అనారోగ్యం బారిన పడిన విషయం విదితమే.

ఎమ్మెల్యే చిట్టిబాబుకు ఎంఈఓల వినతి


ఎమ్మెల్యే చిట్టిబాబుకు వినతిపత్రం అందిస్తున్న ఎంఈఓలు

మామిడికుదురు: ఎంఈఓ–2 ఆప్షన్ పొందిన తమకు జాబ్ చార్ట్ ప్రకటించాలని, మూడు నెలల నుంచి రావాల్సిన జీతం ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎంఈఓ–2లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు వినతిపత్రం ఇచ్చారు. నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చిట్టిబాబును కలసి తమ డిమాండ్లను సీఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. తాము ఏ విధమైన విధులు నిర్వహించాలో ప్రభుత్వం ఇంత వరకు జాబ్ చార్ట్ ప్రకటించకపోయినా నాడు–నేడు, విద్యార్థుల శాతం పెంపు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలన తదితర అంశాలను పరిశీలిస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్-2గా పని చేస్తూ ఎంఈఓగా ఆప్షన్ పొందామన్నారు. జూన్ 19వ తేదీన ఎంఈఓ–2గా బాధ్యతలు చేపట్టిన తమకు ఇంత వరకు జాబ్ చార్ట్ ప్రకటించలేదన్నారు. నాటి నుంచి నేటి వరకు జీతాలు కూడా చెల్లించలేదన్నారు. తమ సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకు వెళ్లాలని కోరారు. ఎమ్మెల్యేను కలసిన వారిలో ఎంఈఓ–2లు మోకా వెంకన్నబాబు, మోకా ప్రకాష్, కేవీపీ నందు, పెచ్చెట్టి శ్రీనివాస్ ఉన్నారు.

చిన్నారి కుటుంబానికి రూ.10 వేల సాయం

మామిడికుదురు: గెద్దాడ గ్రామానికి చెందిన రౌతులపూడి రమేష్ కుమార్తెకు ఇటీవల ఓపెన్ హార్ట్ సర్జరీ చేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ చిన్నారి నెల నెలా వైద్య ఖర్చులకు జైభీమ్ సేవా సమితి సభ్యులు సోమవారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. సర్పంచ్ గుబ్బల గీతాభవాని ద్వారా ఈ సహాయం అందజేశారు. కార్యక్రమంలో గ్రూపు ముఖ్య సలహాదారు తాడి సహదేవ్, కోశాధికారి ఏలూరి ప్రతాప్, సభ్యులు గోపి, తోట సుభాష్ పాల్గొన్నారు.

ప్రసాదరావుకు పలువురి పరామర్శ

అంబాజీపేట: మాతృవియోగంతో బాధపడుతున్న రిటైర్డు జడ్జి పులిదిండి వెంకట ప్రసాదరావు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావులను మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, స్థానిక నాయకులు అరిగెల బలరామమూర్తి సోమవారం వారి స్వగృహంలో పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ పులిదిండి నాగభూషణం భార్య సూర్యకాంతం అకాల మృతి చెందడంతో ఆమె చిత్రపటం వద్ద ఘన నివాళులర్పించారు. సూర్యకాంతం ఆత్మకు శాంతి చేకూరాలని శ్రద్ధాంజలి ఘటించి వారి కుమారులకు మనోధైర్యం కల్పించారు.